క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల, కొండాపూర్, చౌడూర్, గురుకుంట, దయాపంతులపల్లి, హజిలాపూర్, కారుకొండ గ్రామాల్లో మండల అధికారులు పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాం నాయక్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడితేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ, భద్రునాయక్, ఏపీఓ జ్యోతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



దేవరకద్ర రూరల్: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు అన్నారు. శనివారం కౌకుంట్లలో తుమ్మల శ్రీనుకు రూ. 80వేలు, లక్ష్మన్నకు రూ. 16వేల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేశ్, నర్సింహులు, కొండన్న, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధ్యానం సేకరణ



దేవరకద్ర: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. దేవరకద్ర మండలం నాగారంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని వసతులు కల్పించడంతో పాటు సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. ముఖ్యంగా గన్నీబ్యాగుల కొరత లేకుండా చూడాలన్నార. నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు: తప్పిన ప్రమాదం



అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడికి ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నందికోట్కూర్‌కు చెందిన మాధవ్ తన కుమారుడితో కలిసి మహబూబ్‌నగర్‌కు కారులో వెళ్తున్నాడు. జానంపేట దాటిన తర్వాత కారు డివైడర్‌ను ఢీకొట్టి దానిపైకి వెళ్లింది. కొద్దిదూరం తర్వాత మళ్లీ రోడ్డుపైకి దిగింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం బాగా దెబ్బతిన్నది. కారులో ఉన్న మాధవ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అందులో ఉన్న ఆయన కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనలో కారు వెనుక టైరు విడిపోయింది. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ దశరత్ నాయక్ అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. టోల్‌ప్లాజా సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును మూసాపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్‌వీడీసీ కళాశాలలో శనివారం హెట్రో బయోఫార్మా ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 420 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా.. 74 మంది ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఫణిప్రసాద్, డైరెక్టర్ సయ్యద్ ఇబ్రహీం ఖలీల్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, కంపెనీ ప్రతినిధులు రాజేశ్వరి, ప్రవీణ్ కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉగ్రవాదులను అంతమొందించాలి

- పహల్గాం ఘటనపై పెల్లుబికిన నిరసనలు
- కొవ్వొత్తులతో ర్యాలీ.. మృతులకు నివాళి



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ క్రీడలు/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జడ్చర్ల టౌన్: దేశంలో ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయడంతో పాటు జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదులను అంతమొందించాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో పహల్గాం మృతుల ఆత్మశాంతికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశంలో ఉగ్రవాదం అనేది లేకుండా చర్యలు చేపట్టాలని ఆ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు పటేల్ సత్తయ్య కోరారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, కృష్ణుడు, శేఖర్, మోహన్ రెడ్డి, రహీం, వహీద్, ఇక్బాల్, రాములు, అనంతరెడ్డి రంగినేని మన్మోహన్ పాల్గొన్నారు.

■ సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సామాన్య పౌరులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడటం పిరికిపంద చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపల్లి రాము, ప్రధాన కార్యదర్శి కె.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ బాషా, కోటకదిర నరసింహ, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, సత్యనారాయణరెడ్డి, పూజ, ఇందిర, అరుణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

■ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, కార్యదర్శి కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, క్రీడా సంఘాల ప్రతినిధులు జగన్మోహన్‌గౌడ్, రజనికాంత్ రెడ్డి, రాంచందర్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. అంతకుముందు జెడ్పీ మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, జీబీ పాల్, నారాయణ, నర్సింహులు, యాదయ్య, వెంకన్న, నస్కంటి నాగభూషణం, భగవంతు, బుచ్చన్న, డేవిడ్, నాగాంజనేయులు, రియాజుద్దీన్, రహిమాన్, వహీద్, అంజన్న, మోహినొద్దీన్ పాల్గొన్నారు.

■ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పహల్గాం ఘటనను నిరసిస్తూ న్యూటౌన్ నుంచి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు. మతోన్మాదాన్ని ప్రేరేపించే సంస్థలు, వ్యక్తులను కఠినంగా శిక్షించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కిష్టయ్య, పి.ఉమాదేవి, ఆర్.నర్సింహులు, వి.భాస్కర్, మణ్యం, వేణుగోపాల్, అజయ్, హేమంత్‌కుమార్, కనకమ్మ, అక్తర్‌హుస్సేన్, జావేద్, అయూబ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

■ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బాదేపల్లి మార్కెట్‌లో వ్యాపారులు క్రయవిక్రయాలను నిలిపివేశారు. వ్యాపారులు, సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి యార్డు కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.



రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో..



సీపీఐ ఆధ్వర్యంలో..



టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో..



జడ్చర్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

కనీవినీ ఎరగని రీతిలో వరంగల్ సభ



కొల్లూర్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జడ్చర్ల టౌన్/నవాబుపేట/మిడ్జిల్: వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కనీవినీ ఎరగని రీతిలో జరగనుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేట, రాఘవేంద్రకాలనీ, గంగాపురం గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావ వేడుకలు ఒకరోజు ముందుగానే ప్రారంభమయ్యాయని, ఆదివారం సైతం అన్ని గ్రామాలు, పట్టణాల్లో సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేని విధంగా లక్షలాది మందితో వరంగల్ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోవడమే కాకుండా తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించలేకపోతుందని విమర్శించారు. ప్రజలు ఏం కోల్పోయారో తెలుసుకుంటున్నారని.. మళ్లీ కేసీఆర్ నాయకత్వం కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి.మురళి, కోడ్గల్ యాదయ్య, కౌన్సిలర్ బుక్క మహేశ్, శ్రీనివాస్ యాదవ్, కాలేబ్, కరాటే శ్రీను, సాగర్, గోవర్ధన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

■ నవాబుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, చెన్నయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచులు గోపాల్‌గౌడ్, రఘు, యాదయ్య, చందర్‌నాయక్, రఘుగౌడ్, అబ్దుల్లా, నవనీత్, రమేశ్ పాల్గొన్నారు.

■ మిడ్జిల్ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండుయాదవ్, నాయకులు బాల్‌రెడ్డి, సుదర్శన్, జంగారెడ్డి, శ్రీనివాసులు, నారన్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ ఈపీసెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈలో శనివారం ఏర్పాటుచేసిన మోడల్ ఈపీసెట్ పరీక్ష కేంద్రాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని.. వారిలో ఈపీసెట్‌పై భయం పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమ్మర్ క్యాంపులో భాగంగా న్యూటౌన్‌లోని యూనిక్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ యూనిస్టూట్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, పేయింటింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల నిర్వాహకుడు మహ్మద్ సద్దాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు డ్రాయింగ్ బుక్, పెన్సిల్, పరీక్ష ప్యాడ్, ఆయిల్ పాస్టెల్స్, కలర్ పెన్సిల్ తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95050 26190 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సామాజిక సేవకు అవార్డు

మహబూబ్‌నగర్ రూరల్: మదాసి/మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములుకు అవార్డు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాలకు గాను మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు–2025కు ఆయన ఎంపికైనట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.సరోజనమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో ఆ సంస్థ ప్రతినిధుల చేతులమీదుగా రాములు అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి రవిశంకర్

హన్వాడ: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని.. బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ రవిశంకర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం హన్వాడ మండలం వేపూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని వివరించారు. మానసిక, శారీరక ఎదుగుదల నిలిచిపోయి భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. పిల్లలు కూడా శారీరక, మానసిక ఎదుగుదల లేకుండా పుట్టే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. అదే విధంగా బాలలను ఎవరూ పనిలో పెట్టుకోరాదని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవికుమార్ యాదవ్, యోగేశ్వర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం మహా చండీహోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారిని లక్ష్మీదేవి, సరస్వతి మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 13 హోమ గుండాల్లో 52మంది దంపతులతో పండితులు మొట్టా చిపవన్, వెలికంటి కార్తితీర్థం, సుమన్, పూర్ణచందర్, దామోదర్ వేద మంత్రోచ్చారణల మధ్య మహా చండీహోమం జరిపించారు. హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద గుప్తా మాట్లాడుతూ.. హోమాలు, యజ్ఞాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరగాలని.. ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. చండీ హోమం ఫలితం మున్సిపాలిటీలో ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, స్థానికులు విజయలక్ష్మి, అశోక్‌రావు, సురేందర్, ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుబ్బ సుజాత, శ్రీను, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



చౌడూర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవాబుపేట: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని కాకర్జాల, చౌడూర్, కొల్లూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తూ.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసుయాదవ్, ఖాజా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, రమేశ్‌గౌడ్, అమరేష్, శ్రీహరి, సత్యం, నర్సింహ, ఉమర్, ఆంజనేయులు, కుమార్, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, ఖాజామైనుద్దీన్ పాల్గొన్నారు.

సన్నబియ్యంతో పేదలకు మేలు



రేషన్ లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దేవరకద్ర రూరల్: రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని కాంగ్రెస్ పార్టీ కౌకుంట్ల మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రేకులంపల్లిలో రేషన్ లబ్ధిదారు హరిజన్ నాగమ్మ ఇంట్లో పార్టీ నాయకులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, గ్రామాధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

లాక్రోస్ జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎన్.కృష్ణ



కె.శ్రీనివాసులు



దివాకర్



భాస్కర్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆగ్రాలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే లాక్రోస్ జాతీయ జూనియర్, సీనియర్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎన్.కృష్ణ (నవాబ్‌పేట మండలం సిద్దోటం), కె.శ్రీనివాసులు (కోయిలకొండ), దివాకర్ (కొత్లబాద్), భాస్కర్ (సూగూర్) తెలంగాణ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు.

‘భూ భారతి’తో బహుళ ప్రయోజనాలు

- భూ రికార్డుల నిర్వహణలో మరింత పారదర్శకత
- కలెక్టర్ విజయేందిర బోయి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రికార్డుల నిర్వహణలో మరింత పారదర్శకతకు ధరణి స్థానంలో భూ భారతి–2025 చట్టాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. నిషేధిత భూములు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ, మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్ల మార్పు, సవరణ వంటి అపరిష్కృత సమస్యలను వేగంగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఏదేని సమస్య తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాకుంటే ఆర్డీఓకు.. అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతన్నను రాజు చేయాలన్నదే లక్ష్యం..

భూ సంబంధిత సమస్యలన్నింటికి భూ భారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నను రాజు చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ధరణితో రైతులు అవస్థలు పడ్డారని.. మళ్లీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ నష్టపోరాదని భూ భారతి చట్టం తెచ్చామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సన్నరకం వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో 90 శాతం రైతులు సన్నాలు పండిస్తున్నారని చెప్పారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలనే ఆలోచన గతంలో ఎవరికి రాలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆలోచన చేసి.. రైతుల నుంచి సేకరించిన సన్నరకం వడ్లను మిల్లింగ్ చేసి ప్రతి పేద కుటుంబానికి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతుందని వివరించారు. సదస్సులో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్డీఓ నర్సింహులు, ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ ఘాన్సీరాంనాయక్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన రైతులు

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రాచాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అడ్డాకుల: మండలంలోని రాచాల ఎస్సీ కాలనీలో ఇస్తంపల్లికి వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే నివాసగృహాల వద్ద తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ఇళ్లల్లో నివసించే వారితో పాటు చిన్న పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆడుకుంటూ వెళ్లే పిల్లలకు వారి చేతికందే ఎత్తులోనే తీగలు ఉండటంతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికుడు చెన్నకేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.